ఆంధ్రజ్యోతి
Happy Ugadi

ANDHRAJYOTHY

# పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 9 ఏప్రిల్ 2024





విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది వేడుకలు
ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి 8లో..


రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 మంగళవారం
సహర్ 4:33 బుధవారం

# రైతులను ఆదుకుంటాం

- కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే వర్షాభావం...
- కాంగ్రెస్‌ను బదనాం చేసే కుట్ర...
- తరుగు పేరుతో రైతులను దోచుకున్నప్పుడు కొప్పుల నోరెందుకు మెదపలేదు...
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

గోదావరిఖని, ఏప్రిల్, 8: జిల్లాలోని రైతాంగాన్ని ఆదుకోవలన్నదే తమ సంకల్పమని, పత్తిపాక రిజర్వాయర్, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించి తీరుతామని, ఇవి చేయకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్ని కల్లో తాను, ఎమ్మెల్యేలు విజయ రమ ణారావు, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఓట్లు అడుగరని, ఇది తన చాలెంజ్ అని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొ న్నారు. సోమవారం స్థానిక ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ ఏడు వర్షాకాల మంతా కేసీఆరే ముఖ్య మంత్రి అని, ఆయన ముఖ్యమంత్రిగా ఉండగానే వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, అప్పుడు వర్షాలు పడకపోతే శీతాకాలంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను బాధ్యులను చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన తరువాత బీఆర్ఎస్‌కు ఓపిక లేకుండా ఉందని, కేసీఆర్ అడ్డు అదుపు లేకుండా దూషిస్తు న్నాడన్నారు. కేసీఆర్ నియంతృత్వ ధోరణి నుంచి ప్రజలు మార్పు కోరుకున్నారని, అదే ప్రజలు చేసిన పాపమా అని ఆయన ప్రశ్నించారు. వర్షాలు పడకపోవడం ప్రకృతి వైపరిత్యమని, దానిని ఒక పార్టీకి అంటగట్టి ప్రజలను వంచించాలని చూస్తున్నారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికార పత్రికలోనే గడిచిన అక్టోబరు నెలలో వర్షాలు పడలేదని, బొట్టుబొట్టు కాపాడుకోవాలని రాశారన్నారు. వారు అధికారం కోల్పోయారు కాబట్టి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపుతున్నారని శ్రీధర్‌బాబు విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగానికి మేలు చేసేందుకు ఉన్న నీళ్లను సద్వినియోగ పరిచి పంట పొలాలు ఎండిపోకుండా మంత్రులు, ఎమ్మెల్యేలంతా రాత్రిపగలు శ్రమిస్తున్నారన్నారు. రైతులను వంచించేందుకు బీఆర్ఎస్ దొంగ దీక్షలు చేస్తోందని, మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉండి బస్తాకు ఐదు కిలోలు, క్వింటాళ్‌కు 10 నుంచి 12కిలోలు తరుగు పెట్టి దోచుకుంటుంటే నోరెందుకు మెదపలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీల మేరకు మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అవకాశం ఇచ్చిందని, 40కోట్ల ఉచిత టికెట్లను అందజేశామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉండి కూడా రైతులను ఆదుకోలేకపోయారని, తరుగును ఆపలేక పోయారన్నారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మోడల్ ఎమ్మెల్యే అని, రామగుండం కార్పొరేషన్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం అన్ని రకాలుగా ఆలోచించి ఈ నియోజకవర్గానికి ఎంతో సేవ చేసిన వెంకట స్వామి మనుమడు, యువకుడు గడ్డం వంశీని పెద్దపల్లి అభ్యర్థిగా ప్రకటించిం దన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలంతా ఏకతాటిపై ఉన్నామని, ఎన్నిక వంశీది కాదని, కాంగ్రెస్ ప్రతీ కార్యకర్తదని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మక్కాన్‌సింగ్‌కు వచ్చిన మెజార్టీ కంటే అత్యధిక మెజార్టీ రామగుండం నియోజక వర్గంలో గడం వంశీకి రావాలని, అప్పుడే ముఖ్యమంత్రి వద్ద తాను, రాజ్‌ఠాకూర్ ఈ ప్రాంతానికి మరిన్ని నిధులు, ప్రాజెక్టులు తెచ్చేం దుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్కు, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, 800 మెగావాట్ల జెన్‌కో పవర్ స్టేషన్ ఏర్పాటుకు మార్గం పూర్తి స్థాయిలో సుగమమం అవుతుందన్నారు. ఎన్నికల తరువాత సింగరేణి ప్రాంతంలో ఏడువేల మందికి, జెన్‌కో స్థలాల్లో నివాసముంటున్న మూడువేల మందికి పట్టాలు ఇప్పిం చేందుకు చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు పేర్కొ న్నారు. ఈ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.



సమావేశానికి హాజరైన మహిళలు

### కమల్‌హాసన్‌ను మించిన నటుడు 'కొప్పుల'

- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కమల్‌హాసన్‌ను మించిన నటుడని, సింగరేణి కార్మికుడిని అని చెప్పుకునే ఆయన కార్మికులకు చేసిం దేమీ లేదన్నారు. సింగరేణిలో పదుల సంఖ్యలో కార్మికులు చనిపోయినప్పుడు కానీ, కాంట్రాక్టు కార్మి కులు బ్లాస్టింగ్‌లో తునాతునకలైనప్పుడు కానీ న్యాయం చేయలేకపోయారన్నారు. సింగరేణిలో డిపెం డెంట్ ఉద్యోగాలను పది లక్షల రేటు కట్టి బీఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారన్నారు. కాంగ్రెస్ హయాం లో సింగరేణి ప్రాంతంలోని వేల మందికి పట్టాలు ఇచ్చిందన్నారు. సింగరేణిపై ఎవరేం చేశారో చర్చకు సిద్ధమని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడా నికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తు న్నామని, రూ.350 కోట్లతో పాలకుర్తి లిఫ్ట్, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థాపనకు ప్రయత్ని స్తున్నామన్నారు.

**ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ** కేసీ ఆర్ స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని, మాజీ మం త్రి కొప్పుల ఈశ్వర్‌కు ఏ మాత్రం సోయి లేదన్నారు. కొప్పుల ఈశ్వర్ చేస్తున్న దొంగ దీక్షలను ఎవరూ నమ్మే స్థితిలో లేరని విమ ర్శించారు. పత్తిపాక రిజర్వా యర్‌ను నిర్మించి తీరుతామన్నారు. నాలుగు సార్లు మేడారం, ధర్మపురి నుంచి గెలిచిన ఈశ్వర్ చేసిందేమీ లేదన్నారు.

### సేవ చేయడానికి ఆశీర్వదించండి...

పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ

పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిం చాలని పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కోరారు. తాను స్వతాహాగా వ్యాపారంలో నిలదొక్కుకుని ఎలక్ట్రికల్ బైక్ కంపెనీ పెట్టానని, 500మందికి ఉపాధి కల్పించానన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ యువ తకు ఉపాధి కల్పించేం దుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని వంశీకృష్ణ పేర్కొ న్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వివేక్, గడ్డం వినోద్, ప్రేమ్‌సాగర్ రావు, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, నాయకులు బాబర్ సలీంపాషా, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, బయ్యపు మనోహర్‌రెడ్డి, గట్ల రమేష్, విజయ్, అంతర్గాం, పాలకుర్తి మండలాల ఎంపీపీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సౌకర్యాలు కల్పించాలని రోడ్డెక్కిన విద్యార్థులు



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మంథనిరూరల్, ఏప్రిల్ 8: పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని వెంకటా పూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిరా వ్‌ఫూలే గురుకుల పాఠశాలలో సౌక ర్యాలు కల్పించాలని విద్యార్థులు సోమ వారం ఆందోళనకు దిగారు. గురుకుల పాఠశాలకు చెందిన విద్యా ర్థులు మూడు కిలోమీటర్లు నడిచి వచ్చి మంథని-కాటారం ప్రధాన రహదారి ఆరెంద క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. గురుకుల పాఠశాలలో సరైన వసతులు, సౌకర్యాలు లేవని, బాతురూమ్‌లకు డోర్లు, నీటి సరఫరా సక్రమంగా లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నా మని విద్యార్థులు తెలిపారు. ఈ సంవత్సరం రావాల్సిన యూనిఫాంలు కూడా రాలేదన్నారు. గురుకుల పాఠశాల ను మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న మంథని ఎస్ఐ వెంకటకృష్ణ వారిని సముదాయించి హాస్టల్‌కు తరలించా రు. ఈ విషయంలో తెలుసుకున్న ఆర్‌సీఎం గౌతమ్‌రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలలో సమస్యలు ఉన్న మాట వాస్త వమేనని, వచ్చే విద్యాసంవత్సరం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల ఆందోళనపై విచారణ చేపడతామన్నారు.

## ఓటరు నమోదు దరఖాస్తు సమర్పణకు 14 వరకు అవకాశం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 8: ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఈ నెల 14 వరకు తుది గడువని పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం పెద్దప ల్లి శాసనసభ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో బి గంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఏప్రిల్ 1 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు లేని పక్షంలో ఈ నెల 14 లోగా ఎన్‌వీఎస్‌పీ పోర్టల్, ఓటర్ హెల్ప్‌లైన్ పోర్టల్, ఫారం 6 నింపి ఈ నెల 14 లోగా సంబంధిత బూత్ స్థాయి అధికారికి దరఖాస్తు అందజేసి ఓటు హక్కును పొందాలన్నారు. ఓటు హక్కు పొందిన ప్రతీఒక్కరు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుకోవాలని బి గంగయ్య సూచించారు.







## ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిపాలన

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 8: రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన కొనసాగుతుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చటానికి స్థానిక మార్కెట్ రోడ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా-సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సాగునీటి సమస్యలు తీర్చటానికి సైతం ఇరిగేషన్ అధికారులతో సమక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మంథనిలో గోదావరినది వద్ద ఫిల్టర్ బెడ్‌ను పునరుద్ధరిస్తామన్నారు. సమస్యలను ప్రజలకు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

● **పంచాంగం ఆవిష్కరణ..**

న్యాయవాది శశిభూషణ్‌కాచే ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర పంచాం గాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సోమవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

















## నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేతన్నల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప రామక్రిష్ణ, రెడ్డబోయిన గోపి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ 10న సిరిసిల్లలో నేతన్నలకు అండగా దీక్ష తలపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సిరిసిల్ల వెళ్లి వస్త్ర పరిశ్రమ ఆసాములతో సమావేశమయ్యారని తెలిపారు. చర్చల అనంతరం నేతన్నలు వస్త్ర పరిశ్రమ తెరిచేందుకు అంగీకరించారన్నారు. ఇది బీజేపీ సాధించిన విజయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే బతుకమ్మ చీరల బకాయిలు 270 కోట్ల రూపాయలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని, విద్యుత్ బిల్లులపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే నేతన్నల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# వ్యవసాయ పంపుసెట్ల దొంగ అరెస్టు

సుల్తానాబాద్, ఏప్రిల్ 8: వ్యసనాలకు బానిసగా మారిన ఓ యువకుడు ఇరవై ఏళ్లుగా చోరీలకు పాల్పడుతుండగా అతన్ని పట్టుకుని అతని వద్ద నుంచి ఇరవై వ్యవసాయ పంపుసెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని పొత్కపల్లి పోలీస్‌లు గుంపుల సమీపంలో వంతెన వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్ర వాహనంపై వెలుతున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా అతన్ని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా అతను కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట కొత్తపల్లి గ్రామానికి చెందిన గోపు సంపత్‌గా గుర్తించారు. ఇతను పాత నేరస్తుడని గతంలో అనేక దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడన్నారు. విచారణలో ఈ ప్రాంతంలో అనేక వ్యవసాయ పంపుసెట్లను దొంగలించినట్టు చెప్పాడని దాంతో అతని ఇంట్లో తనిఖీ చేయగా అక్కడ ఉన్న వివిధ కంపెనీలకు చెందిన మూడు లక్షల రూపాయల విలువ గల ఇరవై మోటార్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అవసరాలకు ఒక్కో మోటార్‌ను అమ్ముతూ ఉంటాడని అలా జమ్మికుంట హన్మకొండ ప్రాంతాలలో మోటార్లను అమ్మడానికి వెలుతుండగా అతన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కాలువల మీద ఏర్పాటు చేసుకున్న మోటార్లను లక్ష్యంగా చేసుకుని వాటిని చోరీ చేసాడన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ క్రిష్ణ

పోలీసులకు పట్టుబడిన మోటార్ల దొంగ సంపత్ తన అవసరాల కోసం డబ్బులు కళ్ల జూడడం కోసం ఎలాంటి దొంగతనం అయినా చేయడానికి వెనకాడడని ఏసీపీ అన్నారు. 2004 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్న సంపత్‌పై ఇప్పటి వరకు 16 కేసులు నమోదు అయి ఉన్నాయని అన్నారు. ఇతన్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్ఐ అశోక్ రెడ్డి, ఏఎస్ఐ తిరపతి, రత్నాకర్, హెచ్‌సీ నల్లవెళ్లి సుధాకర్, పీసీ రాజేందర్ సిబ్బందిని ఏసీపీ అభినందించి కొందరికి క్యాష్ రివార్డును అందజేశారు.

# రాజన్న ఆలయానికి అమావాస్య ఎఫెక్ట్

వేములవాడ, ఏప్రిల్ 8: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో సోమవారం అమావాస్య ప్రభావం కనిపించింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా సోమవారం అతి తక్కువ సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం భక్తులు లేక బోసిపోయి ఖాళీగా కనిపించాయి. ఇదిలా ఉండగా సోమవారం అమావాస్య కలిసి వచ్చిన సోమావతి ఎంతో శుభకరమని పురాణాలు చెబుతున్నాయి. అయినప్పటికీ సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం గమనార్హం.



భక్తులు లేక వెలవెలబోయిన ఆలయ ప్రాంగణం

### నేడు రాజన్న క్షేత్రంలో ఉగాది వేడుకలు

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఉగాది వేడుకలు 9వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, రుత్విక్ వరుణము, శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు, అనుబంధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం 10 గంటల 15 నిమిషాలకు పంచాంగ పూజ గావిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పండితులను సన్మానిస్తారు. రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారలను పెద్దసేవపై ఊరేగిస్తారు. ఇదిలా ఉండగా 9వ తేదీ మంగళవారం ఉగాది పర్వదినం నుంచి 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి వరకు తొమ్మిది రోజులపాటు శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 15వ తేదీ సోమవారం నుండి 17వ తేదీ బుధవారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవము, హవనము నిర్వహిస్తారు. 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ ఎదురుగా గల ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి శ్రీ సీతారామచంద్ర స్వామి వారల దివ్య కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదిన వేడుకలు, శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారల కళ్యాణోత్సవం కోసం ఆలయ అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

### నేడు అభిషేకం, కల్యాణం టికెట్ల నిలిపివేత

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో 9వ తేదీ మంగళవారం స్వామివారి నిత్య కల్యాణం, అభిషేకం టికెట్లను నిలిపివేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజల నేపథ్యంలో భక్తులు పాల్గొనే స్వామివారి నిత్య కల్యాణం, అభిషేకం టికెట్ల జారీని నిలిపివేస్తున్నామని, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

## యువకుడి గల్లంతు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్8: మండలంలోని కందుగుల గ్రామంలో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాదం విజయ్(22) హైద్రాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఉగాది పండుగను పురస్కరించుకొని స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని ఉరకుంట దగ్గర ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత అనంతరం స్నేహితులందరూ బయటికి రాగా విజయ్ రాకపోవడంతో వెంటనే స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గత ఈతగాళ్లను బావి వద్దకు వచ్చి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

## బీఐఎస్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8: బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ (బీఐఎస్)ఆధ్వర్యంలో సోమవారం తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ వస్తువులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీపై చర్చించి, విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, బిఐఎస్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, జిల్లా కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ పకిడి జీవన్, వైస్‌ప్రెసిడెంట్ అక్కి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు ఇ కరుణ, ఎస్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్8: ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇషాక్ మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల ఒక విద్యా కేంద్రంగా మారుతున్న తరుణంలో కనీసం విద్యార్థులు ఉండడానికి సంక్షేమ హాస్టళ్లు కరువయ్యాయని అన్నారు. ఉన్న హాస్టళ్లు కళాశాల నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో చందు, శ్రీరామ్, మనోజ్, అంజన్, శృజన్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట, ఏప్రిల్ 8: తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూసిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన పచ్చిమట్ల శ్రీనివాస్ ఇంటి స్థలాన్ని ఆకినపల్లి మురళీధర్ అనే వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కాజేయాలని చూశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

# శానిటేషన్ కార్మికులకు అరియర్స్ చెల్లించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8: కరీంనగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు అరియర్స్ చెల్లించాలని కరీంనగర్ మున్సిపాలిటీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(బీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ పెంచారని, రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంకా అందివ్వలేదన్నారు. మహిళా కార్మికులకు చీపుర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చెత్తను తరళించే ట్రాక్టర్లు, ఆటోలకు టైర్లు, ఆయిల్ మార్చడంలేదని, వెల్డింగ్ పనులు కూడా చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు రావలసిన సబ్బులు, చెప్పులు, నూనెలు, దుస్తులు ఏవీ ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నాలుగు నెలల ఎరియర్స్, ఇతర బెనిఫిట్స్ ఇవ్వాలని లేని యెడల ఈ నెల 10 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షుడు గడ్డం సంపత్, గాలి శ్రీనివాస్, బొల్లి రాజేశ్, పార్నంది ఎల్లయ్య, మేకల రాములు, గడ్డం రాములు, జిల్లెల్ల అనిల్‌కుమార్, దాంపల్లి రాయమల్లు, పురుషోత్తం శ్రీనివాస్, దాసరి రమేశ్, తంగళ్లపల్లి ధర్మేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

## షీటీంపై అవగాహన సదస్సు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 : షీటీంలు నిర్వర్తించే విధులపై కరీంనగర్ మహిళా ఠాణా సీఐ, షీటీం ఇంచార్జి పి శ్రీలత బీసీ స్టడీ సర్కిల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వినియోగ సమయంలో మహిళలు, విద్యార్థులు, యువతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీ సేఫ్ యాప్‌ను 70 మంది విద్యార్థులతో సీఐ డౌన్‌లోడ్ చేయించారు.

## వృద్ధుడి అదృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనగామ గ్రామానికి చెందిన రాయమల్లు(72) అదృశ్యమయ్యాడు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాయమల్లు కనిపించకుండా పోయాడు. బంధువులు గాలించినా ఆచూకీ లభించలేదు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాయమల్లు ఆచూకీ తెలిసిన వారు గ్రామ పోలీస్ అధికారికి (9912051517) సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# కాలువనీటి కోసం రైతుల ఆందోళన

చొప్పదండి, ఏప్రిల్8: పంటలకు శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేయాలని కోరుతూ చొప్పదండిలో రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం చొప్పదండిలో రాయపట్నం రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. డి87 కాలువ పరిధిలోని వరిపొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని మరో తడి నీరు అవసరమని వెంటనే కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వందలాది ఎకరాలలో పంటలు చేతికి అందే సమయంలో నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ అధికారుల దృష్టికి తీసుకుపోతామని పోలీసులు రైతులకు నచ్చజెప్పడంతో రాస్తారోకోను విరమించారు. మండలంలోని చొప్పదండి, కొలిమికుంట, చాకుంట గ్రామాలకు చెందిన రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు.



చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

## ఒకరి ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 8: మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి మతిస్థిమితం సరిగాలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరెల్లి మల్లయ్య(45) కొండగట్టు మెట్ల దారి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం సరిగాలేక పోవడంతో మల్లయ్యను కొండగట్టుకు తీసుకురాగా ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు.

## హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్, ఏప్రిల్, 8: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం మల్టీ జోన్ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 17న మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లోని కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అనే ముగ్గురు మండలంలోని కొత్తదాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసుస్టేషన్ కార్యాలయం పైన మందు పార్టీ చేసుకున్నారు. పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి దావత్ చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో విచారణ చేపట్టి ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై శాఖాపరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదికను అధికారులు పంపారు. నివేదిక ఆధారంగా హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌ను సోమవారం సస్పెండ్ చేసినట్లు మల్టీ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

## నర్మాల గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గంభీరావుపేట, ఏప్రిల్ 8: గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలను అధికారులు సస్పెండ్ చేశారు. గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్‌సీవో మేరి యేసుపాదం నర్మాల ప్రిన్సిపాల్ నిర్మలను సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. నర్మాల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని యశస్వినిపై తల్లిదండ్రుల ముందే ప్రిన్సిపాల్ చేయిచేసుకున్న సంఘటన చర్చనీయాంశం కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై డీసీవో జాక్విలిన్‌ను వివరణగా అడగా, నర్మాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేసినట్లు వెల్లడించారు.

## దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈ నెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోన్ని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

## పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 8: ఎస్ఆర్ఆర్ కళాశాల అటానమస్ పీజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డిలు విడుదల చేశారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 2022-23 విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అటానమస్ హోదా పొందింది. కళాశాలలో పీజీ 1,3వ సెమిస్టర్ల పరీక్షలు మార్చిలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా.ఇ. కొమురయ్య, పురుషోత్తం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డా. ప్రమోద్ కుమార్ డా. మహేష్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయంలో ఎన్ఎస్‌యూఐ కీలక పాత్ర

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో ఎన్ఎస్‌యూఐ కీలక పాత్ర పోషించిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ పక్షాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని మరోసారి పట్టుదలతో పనిచేసేందుకు ఎన్ఎస్‌యూఐ నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి హైదరాబాద్‌లో వర్షాలు పడ్డప్పుడు బండి కొట్టుకుపోతే బండి ఇస్తామమని హామీలిచ్చి మోసం చేశారని, అటువంటి నాయకుడిని ఓడించాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు మతం పేరు మీద రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయానికి, కొండగట్టు, వేములవాడ ఆలయాలకు ఎన్ని నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

## దోపిడీ కుట్ర కేసులో 29 ఏళ్లకు నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మారణాయుధాలతో భారీ దోపిడీకి కుట్ర చేసిన కేసులో 29 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సీఐడీ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 1995లో నమోదైన దోపిడీ కుట్ర కేసులో నర్ర చందు అలియాస్ చంద్రయ్య ఏ-27గా ఉన్నాడు. కేసు నమోదు అయినప్పటి నుంచి చందు పరారీలో ఉన్నాడు. కేసు తీవ్రత నేపథ్యంలో జగిత్యాల రూరల్ పోలీస్‌ల నుంచి సీఐడీకి బదిలీ అయింది. అజ్ఞాతంలోఉన్న చందుపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో సీఐడీ పోలీస్‌లు గాలింపు మొదలు పెట్టారు. సీఐడీ చీఫ్ శిఖాగోయల్ ఆదేశాల మేరకు ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ బృందం నిందితుడు చందు నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఉన్నట్లు గుర్తించింది. పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి చందును అరెస్ట్ చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐడీ అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



రవీందర్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8:మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న ఇప్పలపల్లి రవీందర్(42) జమ్మికుంటకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై యూటర్న్ వద్ద ఒక్కసారిగా వాహనం రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇప్పలపల్లి రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రుడిని జమ్మికుంటకు తరలించారు.మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 8: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన పార్వతి సాగర్ (23) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు సంవత్సరాల క్రితం సాగర్ వ్యాపారం చేసుకునేందుకు తండ్రి రాజయ్యను డబ్బులు అడిగాడు. ఇవ్వక పోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స అనంతరం కోలుకున్నాక కిరాణం షాపు పెట్టాడు. షాపు నడువక పోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 1న పొలం వద్దకు వెళ్లి పని చేసుకుందామని తండ్రి తన కుమారుడికి చెప్పాడు. సాగర్ పొలం పనులకు వెళ్లకపోవడంతో ఎందుకు పొలం వద్దకు రాలేదని తండ్రి మందలించాడు. దీనికి తోడు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఏప్రిల్ 8: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, ఆర్‌ఆర్‌నగర్ కాలనీ మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్‌కుమార్ అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అనిల్‌కుమార్ మూడు రోజుల క్రిందట ద్విచక్ర వాహనంపై కామారెడ్డి వైపు వస్తుండగా, ఆర్‌ఆర్‌నగర్ కాలనీ వద్ద వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. దీంతో ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి కరీంనగర్‌కు మెరుగైన చికిత్స కోసం తరళించారు. పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌కు తరళించగా చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

## వరకట్న హత్య కేసులో భర్త, అత్తకు జీవిత ఖైదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 8: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అదనపు కట్నం కోసం వేధించి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో నేరం రుజువు కావడంతో దోషులు బిస్స రాజు, బిస్స దుర్గమ్మకు గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు... గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడి కుమార్తె బీనవేని గౌతమి హనుమాన్ నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బిస్స రాజు మార్చి 14, 2009లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గౌతమి తండ్రి సింగరేణి పదవీవిరమణ చేయడంతో వచ్చిన డబ్బుల నుంచి రూ.10లక్షలు కట్నం తేవాలంటూ గౌతమిని భర్త రాజు, అతని తల్లి బిస్స దుర్గమ్మ వేధించే వారు. ఇదే క్రమంలో ఆగస్టు9, 2014న గౌతమిని భర్త రాజు, అత్త దుర్గమ్మ గొంతు నులిమి హత్య చేశారు. తరువాత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహంపై కిరోసిన్ పోసి నిప్పటించారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది. మృతురాలి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ ఫకీరప్ప చార్జిషీట్ దాఖలు చేశారు. మృతదేహం సమీపంలో చున్ని కాలకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు తీగ లాగడంతో హత్య ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుత వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్, సీఎంఎస్ ఇన్‌చార్జి కొత్తకొండ శంకర్ ప్రాసిక్యూషన్ పక్షాన 28మంది సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు పీపీ జ్యోతిరెడ్డి సాక్ష్యాలు నిరూపించడంతో విచారణ జరిపి న్యాయస్థానం దోషులకు జీవిత ఖైదు విధించారు.

### అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై

## ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్ హస్నాపురి కాలనీ ప్రాంతంలోని ఒక ఇంటిలో ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రాడక్ట్ పేరిట అల్లం, వెల్లుల్లి తయారు చేస్తున్న కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, సంస్థ యజమాని శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుజాతలు తెలిపారు. శుభ్రత పాటించటం లేదని, నాణ్యత లేదనే ఫిర్యాదులతో ఫుడ్ ప్రోడక్ట్ సంస్థలపై వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రొడక్ట్‌లో తనిఖీలు నిర్వహించమన్నారు. తనిఖీల అనంతరం శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ లాబ్‌కు పంపించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు వచ్చిన తర్వాత దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత వెల్లడించారు. కేంద్రంలో నిబంధనల మేరకు శుభ్రత పాటించనందున యజమానికి నోటీసు జారీ చేశామని తెలిపారు.

## దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈనెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోన్ని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

## దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 : ఒక ప్రయాణికుడిని నగర శివారు ప్రాంతానికి తీసుకువెళ్లి కొట్టి దోపిడీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ గత నెల 30న కరీంనగర్‌కు వచ్చి తన పని ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో కోతిరాంపూర్ నుంచి బస్టాండ్ వెళ్లుటకు ఆటోలో ఎక్కాడు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి కలిసి షేక్ షబ్బీర్‌ను సిరిసిల్ల బైపాస్ వైపుగా తీసుకెళ్లి కొట్టి మొబైల్ ఫోన్‌తో పాటు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గండిపెల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నూనావత్ తిరుపతి, బానోత్ రాజులు నిందితులుగా పోలీసులు గుర్తించారు. షబ్బీర్ నుంచి 13 వేల రూపాయల విలువ సెల్ ఫోన్‌తో పాటు బ్యాగ్, అందులోని బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం కార్డు కార్డులు దోపిడీ చేశారు. బాధితుడి మొబైల్ ఫోన్‌లోని సిమ్ కార్డును నిందితుల మొబైల్ ఫోన్‌లోకి మార్చి బ్యాంకు అకౌంట్ ద్వారా 99 వేల రూపాయలను సైతం అపహరించారని విచారణలో వెల్లడైంది. నిందితులిద్దరు టవర్ సర్కిల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించామన్నారు.

## నూకాంబిక అమ్మవారి జాతరకు పోటెత్తిన భక్తులు

అంతర్గాం, ఏప్రిల్ 8: అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాంలో సోమవారం జరిగిన నూకాంబిక(పోచమ్మ) అమ్మవారి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. తమ ఆరాధ్య దైవం నూకాంబిక అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన భక్తులు, కాందిశీకులు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మాలధారణ చేసిన భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా గ్రామ శివారులోని దేవాలయానికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తులు, పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా పలువురు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. జాతరను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావులు నూకాంబిక అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, మాజీ సర్పంచ్ కుర్ర వెంకటమ్మనూకరాజు, జాతర కమిటీ ప్రతినిధులు జే రామారావు, ఇండిబిల్లి రవీందర్, పెంట కోట శివ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, భక్తులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 8: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాసాలు చేపట్టిన ముస్లింలతో దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేస్తున్న కఠిన ఉపవాస దీక్షలతో అల్లా ప్రపంచంలో అందరిని చల్లా చూడాలని ఆకాంక్షించారు. ముందస్తుగా ముస్లిం సోదరులకి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఏప్రిల్ 8: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎన్టీపీసీలోని మసీద్ ఏ జబల్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.డి.ఆసీఫ్ పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముస్లింలను అన్నిరంగాల్లో ఎదిగేలా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్థానికంగా ఉన్న ముస్లింలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

## కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

రామగిరి, ఏప్రిల్ 8: ప్రజాసమస్యల ప్రస్తావన కోసం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఒక్క ఎంపీటీసీ మినహా సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తు ఎంపీడీవో శైలజా ప్రకటించారు. సమావేశంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జడ్పీటీసీ మ్యాదరవేని శారద తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు

ఎలిగేడు, ఏప్రిల్ 8: మండల కేంద్రంలో వాల్మీకి బోయ కులస్తులు పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లికి పువ్వులు, టెంకాయలు, బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకిబోయ జిల్లా సంఘం అధ్యక్షుడు గుడుగుల మహేందర్, గ్రామ అధ్యక్షుడు ముత్కల మల్లేశం, ప్రధాన కార్యదర్శి బలంతుల ఎల్లప్ప, ఉపాధ్యక్షుడు కుడుదుల తిరుపతి, సతీష్, దగ్గుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 'దొంగతనంగా చేపలు పట్టి విక్రయం'

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని పాలితం గ్రామం పరిధిలోని పెద్దచెరువు, పోతరాజు చెరువులలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు తెలియకుండా దొంగతనంగా చేపలు పడుతున్నారని కలెక్టర్ కార్యాలయంలో మత్స్యకారులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలితం గ్రామ శాఖ అధ్యక్షుడు నేరెల్ల స్వామి మాట్లాడుతూ 40ఏళ్ల నుంచి పాలితం, గోపయ్యపల్లి గ్రామాల 43 మంది సభ్యులు కలిసి రెండు చెరువుల్లో చేప పిల్లలను పోసి పెంచుతున్నామన్నారు. కాని గ్రామానికి చెందిన నేరెల్ల మొండయ్య, నేరెల్ల శ్రీనివాస్, నేరెల్ల లక్ష్మయ్య సంఘానికి తెలియకుండా అక్రమంగా దాదాపు 20 లక్షల చేపలను పట్టి విక్రయించారని వాపోయారు. వారిపై కలెక్టర్ చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు రూ.20 లక్షలు రికవరీ చేసి సంఘానికి అందించాలని వినతిపత్రంలో కోరారు.



# విద్యాసంస్థల్లో ముందస్తు ఉగాది వేడుకలు





పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ..



కాల్వశ్రీరాంపూర్‌లో..



ట్రినిటీలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8: తెలుగు నూతన సంవత్సరమైన క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ట్రినిటి బీఈడీ కళాశాల శిక్షణార్థులు , గాయత్రీ విద్యానికేతన్ విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ట్రినిటి బీఈడీ కళాశాలలో వేద పండితులు మల్లోజుల దిలీప్ శర్మ పంచాంగ శ్రవణంతో పాటు విద్యార్థులకు పలు ఉపదేశాలు అందించారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనంతో కూడిన పచ్చడను తాగారు. ఉగాది సంబరాలతో పాటు రంజాన్ పండుగ సంబరాలను కూడా నిర్వహించగా ముస్లిం విద్యార్థులు సేమియా సేవించి మమతాను రాగాలను చాటుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బుర్ర తిరుపతి, దిలీప్ శర్మ, మధుకర్, సుజాత, గోపీనాథ్, రమేష్, తిరుపతి, అనురాధ పాల్గొన్నారు. గాయత్రి విద్యానికేతన్‌లో జరిగిన సంబరాల్లో కళాశాల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ రజనీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి రూరల్:** మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి అర్జున్, మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఉగాది ముందస్తు సంబరాలు నిర్వహించగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తెలుగు నూతన సంవత్సరంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉగాది పచ్చడి విద్యార్థులకు, సిబ్బందికి పంపిణీ చేశారు. అలాగే పెద్దబొంకూరు మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్, విభాగాధిపతి శ్రీనివాస్, ఏవో పవన్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు.

**కాల్వశ్రీరాంపూర్:** మండల కేంద్రంలోని వేదవ్యాస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ జూపాక ఉమామహేశ్వర్ గణపతి పూజ నిర్వహించి విద్యార్థులకు ఆంగ్ల సంవత్సరము, తెలుగు సంవత్సరాల మధ్య గల వ్యత్యాసాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గుర్రం దివాకర్, ప్రిన్సిపల్ కోట సదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓదెల:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ హైస్కూల్లో ఉపాధ్యాయులు ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రత్యేక అధికారి జ్యోతి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

**మంథని:** స్థానిక కాకతీయ హైస్కూల్‌లో ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. పండగ సంబరాల్లో భాగంగా సాంప్రదాయ దుస్తులు ధరించి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు రవి కిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావని, పోషకులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో ఉగాది వేడుకలు



ఓదెల కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న సిబ్బంది

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్**

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 8: జిల్లాలో లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన తన ఛాంబర్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో మద్దతు ధరపై రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని, నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పూర్తి స్థాయిలో 305 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం లోగా ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని, ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, అవసరమైన మేర ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ప్రవీణ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

### సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి..

**సుల్తానాబాద్:** వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని, నిర్దేశి లక్ష్యం మేరకు బియ్యం అప్పగించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ మిల్లర్లను ఆదేశించారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలోని సాయి సరస్వతి ఇండస్ట్రీస్, బొంతకుంటపల్లిలోని నందిని ఇండస్ట్రీస్, స్రవంతి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు సీఎంఆర్ బియ్యంను గడువులో గా ఎఫ్‌సీఐ కి అప్పగించాలని, లక్ష్యం చేరుకోవడానికి పూర్తి సామర్థ్యంతో రైస్‌మిల్లులను నడుపాలని సూచించారు. రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం, సరఫరా చేసిన బియ్యం, రైస్ మిల్లుల్లో అందుబాటులో ఉన్న ధాన్యం తదితర వివరాలను, రిజిష్టర్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ తదితరులు ఉన్నారు.

## ఇసుక రీచ్‌లను రద్దు చేయాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 8: ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కిష్టంపేట, మిర్జంపేట, మొట్లపల్లి గ్రామంలో ప్రభుత్వం ఇసుక రీచ్లకు అనుమతి ఇవ్వగా, ఇసుక రీచ్‌లను రద్దు చేయాలని పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో మానేరు వాగు పరివాహక రైతులు గ్రామస్తులు పరిశీలనా అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఇసుక రీచ్‌ల వల్ల భూగర్భ జలాలు ఎండిపోయి తాగునీటి, సాగునీటి కష్టాలు ఏర్పడుతాయని, ప్రభుత్వం అనుమతి ఇచ్చిన ఇసుక రీచ్‌లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఇసుక రీచ్‌ల ద్వారా వందలాది లారీల ఇసుక తరలించడం వలన రహదారులన్నీ దెబ్బతిన్నాయన్నారు. ఇసుక అధిక లోడుతో లారీల్లో పోతూ గాలి వచ్చినప్పుడు ఇసుకంతా ఇళ్ళ ముందు పడేదని, లారీలు పోవడం వలన రోడ్లన్నీ దెబ్బతిని గ్రామాలు దుమ్ముతో నిండిపోయేవని, దీంతో అనారోగ్యాలకు గురికావడం జరిగిందన్నారు. ఇసుక రీచ్‌లో యజమానులు కిష్టంపేటలో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా మానేరులో రెండు మీటర్లు కాకుండా పది మీటర్ల లోతు ఇసుక తీయడం వలన భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం ఇసుక రీచులను రద్దు చేయాలని వారు కలెక్టర్ కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉయ్యాల పోచాలు, ఉయ్యాల స్వా మి, పోశాల సదానందం, మాదసి సతీష్, పుల్లూరి సాగర్, పంజాల చమన్, కడెం మహేష్, కాసగోని కొమురయ్య, కాసగోని సది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### జిల్లా పరిషత్ పాఠశాలలో మాక్ పోలింగ్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని రాఘవపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హన్మంతు ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్ పోలింగ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మాక్ పోలింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహించి ఓటింగ్ ద్వారా ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం హన్మంతు ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ పద్ధతిపై విద్యార్థులకు వివరించారు. ప్రెసిడెంట్‌గా గుండా రామ్‌చరణ్, వైస్ ప్రెసిడెంట్‌గా బొజ్జ సాత్విక్‌లను విద్యార్థులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

### పురుగుల మందు వాడకంపై అవగాహన

ఓదెల, ఏప్రిల్ 8: మండలంలోని మడక, ఓదెలలో రసాయన మందుల వాడకంపై మహిళా రైతులకు పురుగు మందుల వాడకంపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవోస్ టీసీఐ ఫీల్డ్ ఫెసిలిటర్ అరుణ మాట్లాడుతూ రైతులు పురుగుమందులు పిచికారి చేసే సమయంలో రక్షణ కవచాలను ధరిస్తే వారికి ప్రాణ రక్షణగా ఉంటుందన్నారు.

ప్రతి ఇంటిలో మహిళలు తమ భర్తలకు రక్షణ కవచాల అవసరం, రసాయన మందులను పిచికారి విధానాలను ఆచరించే విధంగా చూడాలని తెలిపా రు. పంటలపై మందులు పిచికారి చేసే మందు ప్రత్యేక మైన మాస్కులు, గ్లౌజులు, హెల్మెట్ సూట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్

**ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్**

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు హఠావో, దేశ్‌కో బచావో నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు ఏఐవై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ధర్మేం దర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ మతో న్మాదాన్ని, మత విద్వేషాలు రెచ్చగొట్టి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడానికి కుటిల ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. హిందూ ఓట్లను కొల్లగొట్టేందుకు రాజకీయాలను అంటక డుతున్నారని, దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ ఓట్లు దండుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ కుటిల రాజకీయా లను దేశ పౌరులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మార్కపురి సూర్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను అన్ని రకాలుగా మోసం చేసిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకటేనని, రెండు పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్, తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, సాదుల శివ, దుర్గం విజయ్ పాల్గొన్నారు.

### నియామకం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 8: బీజేపీ లక్ష్మీనగర్ మండల అధ్యక్షుడిగా కోడూరి రమేష్, జనగామ మండల అధ్యక్షుడిగా గుండబోయిన భూమయ్యను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్, భూమయ్య మాట్లా డుతూ రామగుండం నియోజకవర్గంలో బీజేపీ బలోపేతాని కి కృషి చేస్తామని వారు చెప్పారు.

## నేటి నుంచి శ్రీరామ వసంత నవరాత్రోత్సవాలు

మంథని, ఏప్రిల్ 8: స్థానిక గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీసీతారామాలయంలో నేటి నుంచి ఈనెల 17వ తేదీ వరకు శ్రీరామ వసంత నవరాత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఫౌండర్ ట్రస్టీ మెంబర్స్ సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 17న శ్రీరామ నవమిని పురస్కరించుకొని వైభవంగా శ్రీసీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

### సాగునీటి కోసం రైతుల పాట్లు

ఓదెల, ఏప్రిల్ 8: సాగునీటి కోసం రైతన్నలు కంట కన్నీరు పెడుతున్నారు. వారం వరకు ఎస్సారెస్పీ కాలువ నీటి సరఫరా జరగగా పంటలకు సరిపడా నీరు అందలేదు. మరో రెండు వారాలకు కోతకు వచ్చే పంటలకు నీరులేక ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి.

దీంతో వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో రైతన్నలు మిగిలిన వరి పంటల ధాన్యాన్ని దక్కించుకునేందుకు విధిలేక ఓదెల, కొలనూర్, కనగర్తి, కొమిర, పిట్టల ఎల్లయ్యపల్లి, నాంసానిపల్లి, లంబాడ తండ, ఇందు ర్తి గుంపుల, గూడెం, పోత్కపల్లి తదితర గ్రామాల్లో పూర్తికానీ పచ్చటి వరి పంటలను సైతం హార్వెస్టర్ల తో కోయిస్తున్నారు. మరో కొందరు రైతులు కాలు వల్లో నిలిచిన నీటిని ట్యాంకర్ల ద్వారా పంటలకు సరఫరా చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని పంటలకు సరఫరా చేసుకుంటున్నారు.

### ఇసుక డంపుల సీజ్

మంథనిరూరల్, ఏప్రిల్ 8: మండలంలోని గుంజపడుగు గ్రామ శివారులోని కానిపేట గుడి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 25 ట్రాక్టర్ల ఇసుక డంపులను తహశీల్దార్ రాజయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ వెంకట్రాజం సోమవారం పట్టుకున్నారు. గ్రామ శివారులో అక్రమంగా ఇసుక డంప్ నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో సీజ్ చేసి గ్రామ పంచాయతీ వద్దకు తరలించినట్లు తెలిపారు.

### ఇసుక లారీ పట్టివేత

రామగిరి, ఏప్రిల్ 8: మండలంలోని నాగేపల్లి బస్‌స్టాప్ సమీపంలో మంగళవారం పోలీసులు చేపట్టిన తనిఖీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏపీ 36 టీబీ 2862 నంబరు గల ఇసుక లారీని పట్టుకున్నారు. ఇసుక తరలింపు అనుమతి పత్రాల చూపించాలని పోలీసులు కోరగా సరైన సమాధానం రాకపోవడంతో అనుమానించిన ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇసుక లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపడుతున్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 8: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం జీఓ 22ను గెజిట్ చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్జీ-2 ఏరియాలోని సివిక్ జోన్లలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంట్రాక్టు కార్మికులను పట్టించుకోలేదని, సాక్షాత్తు ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా సింగరేణిలో కాంట్రా క్టు కార్మికులు లేరని ప్రకటించినట్టు తెలిపారు. 2021లో ఐదు జీవోలను జారీ చేసిన అప్పటి ప్రభుత్వం 22వ జీవోను గెజిట్ చేయని కారణంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెరగలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, మూడు నెలలు గడుస్తున్నా హామీ నెరవేర్చలేదని అశోక్ అన్నారు. వెంటనే జీవో 22ను గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేస్తే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో చలపతి నాయక్, లక్ష్మి, కవిత, సమ్మయ్య, రాధమ్మ పాల్గొన్నారు.